క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

ఇతిహాసాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు రామాయణం గురించి వివరిస్తున్న రిటైర్డ్ టీచర్ పాణి

సబ్బవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు నీతి కథలు చెప్పడంతో పాటు రామాయణం సారాంశాన్ని బుధవారం వివరించారు. విశ్రాంత ఉపాధ్యాయిని పాణి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. విద్యార్థులంతా విధిగా రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాల సారాంశాన్ని తెలుసుకోవాలన్నారు. వీటిని చదవడం వల్ల భారతీయ సంస్కృతిపై మరింత అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి.శిరీషతో పాటు పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్యాన్‌కు ఉరేసుకుని వ్యక్తి మృతి

పెందుర్తి: మండలంలోని వేపగుంట పైడిమాంబ కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. దీనిపై స్థానికులు, పెందుర్తి పోలీస్‌లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేపగుంట పైడిమాంబ కాలనీలో నివాసం ఉంటున్న గాలి గోవింద్(35–40) అనే వ్యక్తి వృత్తి రీత్యా రోడ్డుపై తోపుడు బండి పెట్టుకుని పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య తన నివాసంలో టవల్‌తో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటన సమయంలో భార్య, పిల్లలు ఇంట్లో లేరు. వేసవి సెలవులు కావడంతో తునిలోని తల్లిదండ్రుల ఇంటికి వెళ్లారు. ప్రాథమిక దర్యాప్తులో ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యకు కారణంగా పోలీస్‌లు భావిస్తున్నారు. ఘటనపై పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

18న ఉచితవైద్య శిబిరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బ్రహ్మకుమారీస్ సంస్థ ఇన్‌చార్జి రామకోటి

అగనంపూడి: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ అగనంపూడి ఆధ్వర్యంలో ఈ నెల 18న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు బ్రహ్మకుమారీస్ అగనంపూడి సంస్థ ఇన్‌చార్జి బీకే రామకోటి తెలిపారు. దివ్యజ్యోతి భవనంలో కూర్మన్నపాలెంలోని ఏ ప్లస్ ఆస్పత్రి సౌజన్యంతో ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు ఉచిత వైద్యశిబిరం ఉంటుందని చెప్పారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసన్, మధుమేహం, గైనిక్, ఎముకల వైద్య నిపుణులు పాల్గొని, అవసరమైన ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కిడిమి హనుమంతురావు, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, బి.శ్రీనివాసరావు, ఎం.కోటేశ్వరరావు, కోట్ని నరసింహమూర్తి పాల్గొన్నారు.

వుడాకాలనీ జేఏసీ చైర్మన్‌గా నారాయణమూర్తి

పెదగంట్యాడ: వుడా కాలనీ ఫేజ్ 1,2,3 జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్‌గా రంభ నారాయణమూర్తి ఎన్నికయ్యారు. ఈ మేరకు వుడా కాలనీలో వుడా కాలనీ హౌస్ ఓనర్స్, అపార్టుమెంట్ ఓనర్స్‌తో బుధవారం సమావేశం నిర్వహించారు. మూడు ఫేజ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు ఏకగ్రీవంగా రంభ నారాయణమూర్తిని ఎన్నుకున్నారు. అనంతరం ఆయన్ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ వుడాకాలనీ మూడు ఫేజుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు హేమంత్, అండిబోయిన అప్పారావు, ఆర్.రమణ, ఆర్.నారాయణమూర్తి, సత్యనారాయణ, అబ్దుల్లా పాల్గొన్నారు.

ఇచ్చట రైళ్లు నిలపబడవు!

పేరుకే రైల్వే స్టేషన్.. ఎక్స్‌ప్రెస్‌లు కాదుకదా.. ఒక్క పాసింజర్ రైలు కూడా ఆగని దుస్థితి తాడి రైల్వే స్టేషన్‌ది. ప్రయాణికుల ఆదరణ లేదని చెప్పి, పాసింజర్ రైళ్ల హాల్ట్‌లను నిలిపేశారు. పరిసర గ్రామ ప్రజలు మాత్రం రైల్వే స్టేషన్లో కనీస సౌకర్యాల్లేక పోవడం వల్లే ప్రయాణికుల రద్దీ తగ్గిందని చెప్తున్నారు. ఒకప్పుడు కాకినాడ, రాజమండ్రి తదితర ప్రాంతాలకు వెళ్లాలనుకునే స్థానికులకు తాడి స్టేషన్ ఆసరాగా నిలిచేది. ఇప్పుడు రైలెక్కాలంటే దువ్వాడ, అనకాపల్లి వెళ్లాల్సిందే. స్టేషన్‌ను అభివృద్ధి చేసి, పాసింజర్ రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

- తాడి.. రైళ్లు ఆగని రైల్వే స్టేషన్
- ఏడాదిగా నిలిచిన పాసింజర్ రైళ్ల హాల్ట్
- దువ్వాడ, అనకాపల్లి స్టేషన్లకు ప్రయాణికులు
- స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని స్థానికుల మొర





తాడి రైల్వే స్టేషన్ సముదాయం



ఛిద్రమైన స్టేషన్ రహదారి

పరవాడ: ప్రత్యక్షంగా ఏడెనిమిది గ్రామాలకు, పరోక్షంగా మరి కొన్ని గ్రామాల ప్రయాణికులకు అనుకూలంగా ఉండే తాడి రైల్వే స్టేషన్ తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. అనకాపల్లి, దువ్వాడ స్టేషన్లు దూరంగా ఉండటంతో పాసింజర్ రైళ్లలో చిన్నచిన్న ప్రయాణాలకు తాడి స్టేషన్‌ను ఆశ్రయించేవారు. ఎక్స్‌ప్రెస్ రైళ్ల కోసం మాత్రం అనకాపల్లి, దువ్వాడ, విశాఖ వెళ్లాల్సిందే. ఏడాదిగా పాసింజర్ రైళ్ల హాల్ట్ నిలిపేశారు. దీంతో తాడి, సాలాపువానిపాలెం, సిరసపల్లి, లంకెలపాలెం, తానాం, కొత్తూరు తదితర ప్రాంత ప్రయాణికులు అవస్థలు పడాల్సి వస్తోంది.

కనీస ఆదాయం లేని స్టేషన్‌గా..

స్టేషన్ ఏర్పాటైన నుంచి పాసింజర్ రైళ్లకు మాత్రమే హాల్ట్ ఉండేది. ఎక్స్‌ప్రెస్ రైళ్ల కోసం అనకాపల్లి, దువ్వాడ, విశాఖ నగరాలకు తరలివెళ్లేవారు. రానురాను అనకాపల్లి, దువ్వాడ రైల్వే స్టేషన్లు అభివృద్ధి చెందాయి. రవాణాకు వీలుగా బస్సు, ఆటో సౌకర్యం పెరిగింది. తాడి స్టేషన్ మాత్రం అభివృద్ధికి ఆమడ దూరంలోని నిలిచిపోయింది. చివరికి ఈ స్టేషన్‌కు వెళ్లే రోడ్డు కూడా దారుణంగా మారింది. దీంతో ప్రయాణికులు తాడి రైల్వే స్టేషన్‌కు రావడం తగ్గించేశారు. ఏడాది క్రితం వరకు ఇక్కడి నుంచి కాకినాడు, రాజమండ్రి ప్రాంతాలకు నెలకు సుమారు 300 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేవారు. ఈ ఆదాయం ప్రింటింగ్ ఖర్చులకూ చాలని పరిస్థితి. దీంతో కనీస ఆదాయం లేని స్టేషన్‌గా తాడి మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో గతేడాది మే నుంచి ఇక్కడ పాసింజర్ రైళ్ల హాల్ట్‌ను నిలిపేశారు.



అధ్వానంగా మారిన ప్లాట్ ఫారం

వ్యయప్రయాసలు

ప్రస్తుతం తాడి రైల్వే స్టేషన్ అనకాపల్లి, దువ్వాడ రైల్వే స్టేషన్లకు అనుసంధానకర్తగా వ్యవహరిస్తోంది. ఈ స్టేషన్‌తోపాటు, బయ్యవరం రైల్వే స్టేషన్లో కూడా పాసింజర్ రైళ్ల హాల్ట్‌ను రద్దు చేశారు. దీంతో తాడి, సాలాపువానిపాలెం, సిరసపల్లి, లంకెలపాలెం, తానాం, కొత్తూరు పరిసర ప్రాంతాల ప్రయాణికులు రాజమండ్రి, కాకినాడ తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే అనకాపల్లి, దువ్వాడ స్టేషన్లపై ఆధారపడాల్సి వస్తోంది. వ్యయ ప్రయాసలకు గురవుతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. స్టేషన్‌ను అభివృద్ధి చేస్తే ఈ దుస్థితి ఉండేది కాదని పేర్కొంటున్నారు.



అపరిశుభ్రంగా మారిన షెడ్లు

క్రమేపీ శిథిలావస్థకు..

స్టేషన్‌లో పాసింజర్ రైళ్ల హాల్ట్‌లను రద్దు చేయడంతో ప్రయాణికులు రాకపోకలు లేక స్టేషన్ ఏకాకిగా మిగిలిపోయింది. అనకాపల్లి హైవే నుంచి స్టేషన్ వరకు చాలా ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్డు పూర్తి శిథిలావస్థకు చేరింది. ప్లాట్‌ఫారం పాడవుతోంది. ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బల్లలు పూర్తిగా పాడయ్యాయి. ఐరన్ పోల్స్‌తో ఏర్పాటు చేసిన షెడ్లు తుప్పు పట్టాయి. స్టేషన్‌లో ఏర్పాటు చేసిన బోరు స్టేషన్ సిబ్బంది మంచినీటి అవసరాలు తీర్చుతోంది. మరి కొన్నేళ్లు ఇలానే కొనసాగితే.. ఇక్కడ ఓ స్టేషన్ ఉండేదన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ మర్చిపోయే పరిస్థితి రాకతప్పదు.



పాడైన సిమెంట్ బల్లలు

స్టేషన్‌ను అభివృద్ధి చేయాలి



పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న పరవాడ ప్రాంతానికి అతి సమీపంలో ఉన్న తాడి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేస్తే ఫార్మా ఉద్యోగులు, కార్మికులతోపాటు పరిసర గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. రైల్వే స్టేషన్‌కు తాడి గ్రామం మీదుగా రహదారి సౌకర్యం కల్పించాలి. – అప్పలాచారి, తాడి

అధికారులు పునఃపరిశీలించాలి



తాడి స్టేషన్‌లో దాదాపు ఏడాది నుంచి పాసింజర్ రైళ్ల హాల్ట్‌ను రద్దు చేశారు. గతంలో కాకినాడ, రాజమండ్రి తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు ఈ స్టేషన్ సౌకర్యంగా ఉండేది. ఇప్పుడు ఆయా ప్రాంతాలకు వెళ్లాలంటే అనకాపల్లి, దువ్వాడ వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు పునఃపరిశీలించి, పాసింజర్ హాల్ట్‌ను పునరుద్ధరించాలి. –సలాది దేముడు, సిరసపల్లి

వ్యయప్రయాసలు తప్పట్లేదు



పాసింజర్ రైళ్ల హాల్ట్‌ను రద్దు చేయడంతో సుదూరంగా ఉన్న అనకాపల్లి, దువ్వాడ రైల్వే స్టేషన్లపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో వ్యయ ప్రయాసలకు గురవుతున్నాం. స్థానికంగా ఉన్న రైల్వే స్టేషన్‌లో పాసింజర్ రైళ్ల హాల్ట్‌ను పునరుద్ధరించాలి. స్టేషన్‌కు వెళ్లే రహదారికి మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. – పెంటారావు, సాలాపువానిపాలెం

డిమాండ్లు పరిష్కరించకుంటే ఉద్యమం

విశాఖ డెయిరీ వేతన కార్యదర్శులు, సహాయకుల యూనియన్

సబ్బవరం: విశాఖ డెయిరీ సంస్థల్లో పనిచేస్తున్న వేతన కార్యదర్శులు, సహాయకులకు కనీస వేతనాలు చెల్లించాలని సబ్బవరం యూనిట్ పరిధిలోని సిబ్బంది డిమాండ్ చేశారు. మండలంలోని ఇరువాడ శివార్లలోని ఓ రిసార్టులో యూనిట్ పరిధిలోని వేతన కార్యదర్శులు, వారి సహాయకులు బుధవారం సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వేతన కార్యదర్శులు, సహాయకుల యూనియన్ అధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ మాట్లాడుతూ పాల సేకరణతో పాటు డెయిరీ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించే కార్యదర్శులు, సహాయకుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. కనీస వేతనాలు, గ్రాట్యుటీ, సెలవులు, ఈఎస్ఐ వంటి డిమాండ్లను పరిష్కరించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించేందుకు యాజమాన్యం ముందుకు రాకపోతే పాడి రైతులకు, పాల సేకరణకు ఇబ్బంది లేకుండానే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. చైర్మన్‌గా తులసీరావు కుమారుడు ఆడారి ఆనందకుమార్ ఉంటే వారి కుటుంబ సభ్యులంతా డైరెక్టర్‌లుగా వ్యవహరిస్తూ విశాఖ డెయిరీని వారి జేబు సంస్థగా వాడుకుంటున్నారని ఆక్షేపించారు. తమ డిమాండ్ల పరిష్కారంతోపాటు, ట్రస్టు నుంచి ఆనందకుమార్ వాడుకున్న రూ.20 కోట్లను తిరిగి చెల్లించే వరకూ పోరాటం ఆగదన్నారు. పాల సంస్థల ప్రెసిడెంట్లను ప్రలోభాలకు గురిచేసి, వారి నోరు నొక్కేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే యూనియన్ తరఫున చోడవరం, యలమంచిలి, అనకాపల్లి, నర్సీపట్నం యూనిట్ల పరిధిలో సమావేశాలు నిర్వహించామన్నారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షులతో పాటు సహాయక అధ్యక్షుడు జి.కనకారావు, కార్యదర్శి డి.సూర్యారావు, సహాయక కార్యదర్శి జామి అప్పలనాయుడు, సబ్బవరం యూనిట్ పరిధిలోని వేతన కార్యదర్శులు, సహాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ

16, 17న తాగునీటి సరఫరాకు అంతరాయం

పెందుర్తి/డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–8 పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 16, 17 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ మురళీకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాయ్‌పూర్ నుంచి సబ్బవరం నేషనల్ హైవే నిర్మాణ పనుల్లో భాగంగా, అమృత్–2.0, 24/7 నీటి సరఫరా నెట్‌వర్క్ అభివృద్ధి పనులు చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పాపయ్యరాజుపాలెం, పురుషోత్తపురం, వేపగుంట ప్రాంతాల్లో వాటర్ ఫ్లో మీటర్స్ అమర్చేందుకు 24 గంటలు తాటిపూడి ప్రధాన పైప్‌లైన్ నీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. దీంతో ఈ నెల 16న ఉదయం 11.30 నుంచి 17న ఉదయం 11.30 గంటల వరకు పూర్తిగా మంచి నీటి సరఫరా ఉండబోదన్నారు. ఈ నేపథ్యంలో తాటిపూడి ప్రధాన పైప్‌లైన్ ఉన్న బల్క్ ఇండస్ట్రీస్ వినియోగదారులకు, జోన్–8 పరిధిలో ఉన్న వార్డు–93(పార్ట్) నుంచి వార్డు–98లో ఉన్న సాయిదుర్గానగర్, దుర్గానగర్, కృష్ణానగర్, అప్పలనరసింహం కాలనీ, హెచ్‌బీ కాలనీ, గోకులం కాలనీ, రెల్లివీధి, కృష్ణరాయపురం, గొల్లివిల్లివానిపాలెం, ఎల్‌ఐసీ కాలనీ, సుజాతనగర్, పాపయ్యరాజుపాలెం, పెందుర్తి పాత గ్రామం, తెలకలవీధి, ప్రశాంతినగర్, క్రాంతినగర్, వుడా కాలనీ, రైల్వే కాలనీ, సావిత్రినగర్, అప్పన్నపాలెం, సింహపురి లే అవుట్, అడవివరం, ఎస్సీ కాలనీ, పాత అడవివరం తదితర ప్రాంతాల్లో మంచి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేయనున్నట్టు చెప్పారు.

దేవీపురంలో శ్రీవిద్య మిడ్ లెవల్ కోర్సు ప్రారంభం

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో శ్రీ విద్య ఉపాసకులకు శ్రీవిద్య మిడ్‌లెవల్ కోర్సును గురుమాత అన్నపూర్ణమ్మ బుధవారం ప్రారంభించారు. ఈ నెల 14 నుంచి 18 వరకు 5 రోజుల పాటు నిర్వహించనున్న ఈ కోర్సుకు అవసరమైన రాజశ్యామల, వారాహి మొదలగు మంత్రోపదేశాలను గురుమాత అందించి, ఆశీర్వదించారు. ఆచార్యులుగా కందర్ప మూర్తి, కందర్ప రమ అవసరమైన శిక్షణ ఉపకరణాలను వినియోగిస్తూ శిక్షణ మొదలెట్టారు. కుల, మత, లింగ, జాతి, ప్రాంతీయ భేదాల్లేకుండా అందర్నీ సమన్వయం చేసుకుంటూ శిక్షణను అందించడం దేవీపురం ప్రత్యేకతగా గురుమాత తెలిపారు. శ్రీవిద్య సాధకులు చేసే క్రతువుల వల్ల వారి అభివృద్ధి తోపాటు దేశ క్షేమం, రక్షణ, శత్రు నిర్వీర్యం వంటి ఫలితాలు సిద్ధిస్తాయన్నారు. రాజశ్యామల, వారాహి మంత్రాల విశిష్టతను తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మౌరిష్(జర్మనీ), నిమిష(సింగపూర్), జెన్య బిర్ప్(బల్గేరియా), లచ్మీమీ గోమని(మారిషస్), లక్ష్మీ అగర్వాల్(యూఎస్‌ఏ)తోపాటు స్మితా మనోహర్(ముంబయి), బెంగుళూర్ నుంచి గౌరీ శంకర్ సౌమ్యరావు తదితరులు హాజరయ్యారు.



దేవీపురంలో శ్రీవిద్య మిడ్ లెవల్ కోర్సు నేర్చుకునేందుకు వచ్చిన శ్రీవిద్య ఉపాసకులు

సప్లిమెంటరీకి సన్నద్ధం



నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు

- ప్రభుత్వ పాఠశాలల్లో 18 వరకు ప్రత్యేక తరగతులు
- 19 నుంచి పరీక్షలు

పెదగంట్యాడ: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మండలంలోని మూడు జెడ్పీ హైస్కూళ్లలో వివిధ సబ్జెక్ట్‌ల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మీ పిల్ల లు పదోతరగతి పాస్ అయ్యేలా మేము బాధ్యత తీసుకుంటామని వారిలో మానసిక స్థైర్యం నింపారు. దీంతో నడుపూరు, ఇస్లాంపేట, గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించే ప్రత్యేక తరగతులకు విద్యార్థులు హాజరవుతున్నారు.

19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

పదోతరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈ నెల 19 నుంచి 28 వరకూ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని విద్యాశాఖ ప్రకటించింది. అప్పటి వరకూ ఆయా సబెక్ట్‌లలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి పాస్ అయ్యేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని విద్యాశాఖాధికారుల సూచనల మేరకు ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకున్నారు.

ఉదయమే తరగతులు

ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకూ రోజుకు మూడు సబ్జెక్టులు ప్రతి సబెక్ట్‌కి గంట సమయం కేటాయిస్తున్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ సబెక్ట్‌లు ఒకరోజు, గణితం, సైన్స్, సోషల్ సబెక్ట్‌లు ఒకరోజు వరుస క్రమంలో నిర్వహిస్తున్నారు.



ఇస్లాంపేట జెడ్పీ హైస్కూల్లో ప్రత్యేక తరగతులు

తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి



పాఠశాలల్లో 22 రోజుల నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. మంచి ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సబ్జెక్టుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. విద్యార్థులు ఇంటిదగ్గర కూడా చదివేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి.
– రాచకొండ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నడుపూరు

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా కార్యచరణ రూపొందించాం వివిధ సబ్జెక్టులలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధతో పాఠాలు చెబుతున్నాం.
– ప్రమీల, ప్రధానోపాధ్యాయురాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇస్లాంపేట

ఉచిత నీటి సరఫరాకు స్పందన

అగనంపూడి: సాధారణ రైలు బోగీల్లోని ప్రయాణికులకు దువ్వాడ రైల్వేస్టేషన్‌లో వివిధ స్వచ్ఛంద సంస్థలు చేపట్టిన ఉచిత మినరల్ వాటర్ బాటిళ్ల పంపిణీకి మంచి స్పందన లంభించింది. వేసవి తాపానికి విలవిలలాడే సాధారణ ప్రయాణికులు, దివ్యాంగులు, మహిళా జనరల్ కంపార్ట్‌మెంట్ ప్రయాణికులకు వీటిని అందిస్తుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకూ 5,250 బాటిళ్లను పంపిణీ చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. బుధవారం కూర్మన్నపాలెం లయన్స్‌క్లబ్ ప్రతినిధి బీఎల్ రెడ్డి ఆర్థిక సహకారంతో చేపట్టిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, శంకరరావు, సీతారామరాజు, ఎస్ఎస్ రావు, నిర్వాహకులు కంచుమూర్తి ఈశ్వర్, ఎంఎస్ఎన్ మూర్తి, జాషువా, కామేశ్వరరావు, కౌశిక్, హిమజ తదితరులు పాల్గొన్నారు.



రైలు ప్రయాణికులకు మినరల్ వాటర్ బాటిళ్లను అందిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసులు ఎత్తివేయాలి

ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకుల డిమాండ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు క్రమశిక్షణ పేరిట ఇచ్చిన సస్పెన్షన్ ఉత్తర్వులు, షోకాజ్ నోటీసులు ఎత్తివేయాలని స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సస్పెన్షన్లకు వ్యతిరేకంగా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ యాజమాన్యం క్రమశిక్షణ పేరుతో నియంతృత్వాన్ని ప్రదర్శిస్తోందన్నారు. తద్వారా కార్మిక వర్గాన్ని భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. ఇది పరిశ్రమ మనుగడకు మంచిది కాదన్నారు. ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ కార్మికులకు సస్పెన్షన్, షోకాజ్ నోటీసులు ఇవ్వడం దుర్మార్గపు ఆలోచన అన్నారు. ఆ నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు రమణమూర్తి మాట్లాడుతూ కర్మాగారంలో ప్రజాస్వామ్యం, వాక్ స్వాతంత్ర్య లేకుండా ప్రభుత్వం, యాజమాన్యాలు గొంతు నొక్కుతున్నాయన్నారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్.రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వై.టి.దాస్, యు.రామస్వామి, రామ్‌కుమార్, డి.వి.రమణారెడ్డి, బొడ్డు పైడిరాజు ప్రసంగించారు. పి.శ్రీనివాసరాజు, సుబ్బయ్య, బి.అప్పారావు, తౌడన్న, దేముడు, టి.సత్యనారాయణ, టి.వి.కె.రాజు, జె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో ప్రసంగిస్తున్న రామస్వామి

కథలు నేర్చుకుందాం రండి..



వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జానకిరామ్ చిన్నారులకు నీతి కథలను బోధించారు. అనంతరం సామూహిక పుస్తక పఠనం చేయించారు. యోగాసనాలు వేయించారు. బొమ్మలు వేయడం నేర్పించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.